## క్లుప్తంగా

### పటిష్టంగా భూముల రీ సర్వే



ముత్తుకూరు : గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే పటిష్టంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ అన్నారు. మండలంలోని వల్లూరు, మల్లూరు పంచాయతీల్లో జరుగుతున్న రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు సంబంధించి విలువైన భూములకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రీసర్వే చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. కొలతల ప్రకారం రాళ్ల నాటే కార్యక్రమం పక్కాగా నిర్వహించాలన్నారు. డీఎస్ఎల్ఓ హనుమాన్ ప్రసాద్, డీఐఓఎస్ శ్రీరామమూర్తి, తహసీల్దార్ సురేష్, డీటీ భాగ్యలక్ష్మి, మండల సర్వేయర్ కామేశ్వరరావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

### నీటి ఎద్దడి లేకుండా చర్యలు

కొడవలూరు : వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ టి.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయాల సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని చెప్పారు. మండలంలో 994 గృహాలు పూర్తి చేయాల్సి ఉన్నందున ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ చూపి పూర్తయ్యేలా చూడాలన్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, ఎంఈఓ వసంతకుమారి, ఈఓపీఆర్డీ ఈ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు

ముత్తుకూరు : మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారం అవుతుందని సెబ్ సీఐ బాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని దమ్మాయపాళెం జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే ముప్పు తప్పదన్నారు. మత్తు పదార్థాలు కలిగి ఉండడం నేరమని తెలియజేశారు. ఈ మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### టిప్పర్ స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం : అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సెబ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ సంగం మండలం పడమటిపాళెం నుంచి కోవూరుకు ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్‌లో ఇసుకను తరలిస్తుండగా, తాము బుచ్చిరెడ్డిపాళెంలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద ఆపి తనిఖీలు చేశామన్నారు. 25 టన్నుల ఇసుకతో పాటు టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ గంగపట్నం వెంకరమణయ్యపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

### 23న గురుకుల ప్రవేశ పరీక్ష

ముత్తుకూరు : ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 23వ తేదీన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సీహెచ్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్‌కు అదేరోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 359 మంది, జూనియర్ ఇంటర్ పరీక్షకు 262 మంది హాజరు కావాల్సి ఉందని వెల్లడించారు.

### బాధ్యతాయుతంగా పనిచేయండి

బుచ్చిరెడ్డిపాళెం : మనబడి నాడు-నేడు, గృహనిర్మాణాల పనులపై సంబంధిత అధికారులు, పాఠశాల హెచ్‌ఎంలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ నరసింహారావు సూచించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నాడు-నేడు, గృహ నిర్మాణాల పనులపై ఆయా శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులపై నూతన కలెక్టర్ చాలా సీరియస్‌గా ఉన్నారని, గడువులోపు పనులు పూర్తి చేసే విధంగా సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కూడా నత్తనడకన సాగుతోందని, త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. గడువులోపు పనులు పూర్తి చేయకపోతే దీర్ఘకాలిక సెలవులపై వెళ్లిపోండి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాడు-నేడు ఏఈ రవి, ఎంఈఓ దిలీప్, ఏపీఎం లలితా, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఆ నేత వస్తున్నారని హడావుడా..?

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు(స్టౌన్‌హౌస్‌పేట): నగరంలో నాలుగేళ్లుగా పత్తాలేకుండా పోయిన నేత తిరిగొస్తున్నారంటూ కొందరు హడావుడి చేయడం హాస్యాస్పదంగా ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విమర్శించారు. నగరంలోని ఏడో డివిజన్లో గల లక్ష్మీపురం, చుండూరువారివీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2019 ఎన్నికల అనంతరం.. కోవిడ్ సమయంలోనూ కనిపించని కొందరు నేతలు తాము ప్రజల ముందుకు త్వరలో వస్తామంటూ ప్రచారం చేసుకోవడాన్ని విమర్శించారు. 2024 ఎన్నికల తర్వాతా వీరు కనిపించరని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. నిరంతరం తాను ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనను, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్ మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద నియంత్రణ చర్యలపై అవగాహన



నెల్లూరు(క్రైమ్): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాద నియంత్రణ చర్యలపై నగరంలోని మెడికవర్ హాస్పిటల్లో డెమోను ఆ శాఖ సిబ్బంది మంగళవారం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో హాస్పిటల్ పైఅంతస్తులో స్మోక్ జోన్‌లో ఇరుక్కుపోయిన వారు, స్పృహ తప్పి గాయపడిన వారిని స్ట్రెచర్ల ద్వారా కిందికి ఏ విధంగా తీసుకురావాలి, తదితరాలపై అవగాహన కల్పించారు. జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి, నెల్లూరు స్టేషన్ అధికారి జాషువా, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న పోలీసులు



నెల్లూరు(క్రైమ్): వేసవి తాపానికి సొమ్మసిల్లిన ఓ మహిళకు చిన్నబజార్ పోలీసులు సపర్యలు చేసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. కలెక్టరేట్ బయట ఓ మహిళ రోడ్డుపై మంగళవారం మధ్యాహ్నం సొమ్మసిల్లారు. అక్కడ విధుల్లో ఉన్న చిన్నబజార్ పోలీసులు విషయాన్ని గమనించారు. మహిళ వద్దకు చేరుకొని చల్లని నీటితో మొహాన్ని కడిగారు. ఆమెను లేపి మంచినీటిని తాగించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆమె వివరాలు తెలియరాలేదు. ఆమె మానసిక స్థితి సక్రమంగా లేదని తెలిసింది.

## కంచి కామకోటి పీఠాధిపతి రాక రేపు

నెల్లూరు(బృందావనం): కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతి నెల్లూరుకు గురువారం రానున్నారని శంకరమఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నుంచి తిరుపతి వెళ్తూ మార్గమధ్యలో నగరానికి సాయంత్రం రానున్నారని చెప్పారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారని పేర్కొన్నారు.

## సమస్యలను పరిష్కరించేంత వరకు పోరుబాట



నెల్లూరు(అర్బన్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నేతలు పేర్కొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జీలతో ఆందోళనను మంగళవారం చేపట్టారు. సంఘ జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి, జిల్లా సెక్రటరీ జనరల్ ప్రసాద్, అసోసియేట్ చైర్మన్ శరత్ బాబు, నేతలు బాబూరావు, రాజేశ్, మురళి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### క్రైమ్ కార్నర్

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు రూరల్: భార్య కాపురానికి రాలేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చెరుకుతోట సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. కిసాన్‌నగర్‌కు చెందిన నాగార్జున (32) కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య, ఏడాదిన్నర వయస్సు కలిగిన కుమారుడు ఉన్నారు. మద్యానికి బానిసవ్వడంతో విసిగిపోయిన భార్య కిసాన్‌నగర్ సమీపంలోని తన పుట్టింటికెళ్లారు. కాపురానికి రావాలని పలుమార్లు కోరినా ఆమె నిరాకరించారు. దీంతో చెరుకుతోటలోని ఓ బార్ సమీపంలో మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టపగలు చైన్ స్నాచింగ్

నెల్లూరు(క్రైమ్): వాటర్ బాటిల్‌ను కొనుగోలు చేసేందుకు దుకాణానికి వచ్చిన గుర్తుతెలియని దుండగుడు వృద్ధురాలి మెడలోని గొలుసును తెంపుకెళ్లిన ఘటన హరనాథపురంలో మంగళవారం పట్టపగలు చోటుచేసుకుంది. వివరాలు.. హరనాథపురంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో వృద్ధురాలు సుధారాణి తన ఇంటి వద్దే ప్రొవిజన్స్ అండ్ ఫ్యాన్సీ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని దుండగుడు బైక్‌పై దుకాణం వద్దకు వచ్చి వాటర్ బాటిల్ కావాలని కోరాడు. వాటర్ బాటిల్‌ను ఇస్తుండగా మెడలోని మూడున్నర సవర్ల బంగారు గొలుసును తెంపుకెళ్లాడు. ఘటనపై బాలాజీనగర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

## మృతుడి వివరాలు లభ్యం

నెల్లూరు(క్రైమ్): వీఆర్ లా కళాశాల సమీపంలో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని కలిగిరి మండలం కమ్మవారిపాళేనికి చెందిన చైతన్య (34)గా రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. కమ్మవారిపాళేనికి చెందిన చైతన్యకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబకలహాల నేపథ్యంలో ఐదేళ్లుగా భార్య దూరంగా ఉంటున్నారు. ఇటీవల తన తల్లికి బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్‌కు.. అక్కడి నుంచి జయభారత్ ఆస్పత్రికి తరలించారు. తల్లితో పాటు హాస్పిటల్లోనే ఆయన ఉంటున్నారు. ఈ క్రమంలో రైలు కిందపడి సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన కోసం కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆత్మహత్య ఘటన పత్రికల్లో ప్రచురితం కావడంతో దాని ఆధారంగా రైల్వే పోలీసులను కుటుంబసభ్యులు సంప్రదించారు.

## గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): తలకు తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. కోవూరులోని చిన్న పడుగుపాడుకు చెందిన మల్లికార్జున (40) రంగనాయకులపేట రైల్వే గేట్‌ను వేస్తున్న విషయాన్ని గమనించకుండా బైక్‌పై వేగంగా ఈ నెల 8న వెళ్లారు. ప్రమాదవశాత్తూ రైల్వే గేట్ అతని తలపై పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. అనంతరం జీజీహెచ్‌లో చేరి చికిత్స పొందుతూ మృతి చెందారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఎస్పీని కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



నెల్లూరు(క్రైమ్): నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బుజ్జిరెడ్డి కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

### ఇఫ్తార్ విందు



నెల్లూరు(బృందావనం): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 42వ డివిజన్లోని ఖుద్దూస్‌నగర్‌లో గల అబూజార్ గఫారీ మసీదులో ప్రత్యేక ప్రార్థనలను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మంగళవారం నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు కరిముల్లా, రాఘవరావు, రామకృష్ణ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

### అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి



నెల్లూరు (టౌన్): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. అధ్యాపకులకు ఏమైనా సమస్యలుంటే తనను కలవొచ్చని చెప్పారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రిన్సిపల్ గురవయ్య, కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ నేతలు సునీల్, సందానీ, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా హెరిటేజ్ వాక్




నెల్లూరు(మినీబైపాస్): ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీని రాష్ట్ర పురావస్తు.. మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రత్నం స్కూల్ నుంచి జిల్లా పురావస్తు శాఖ కార్యాలయం వరకు హెరిటేజ్ వాక్‌ను జరిపారు. సహాయ సంచాలకుడు గంగాధర్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కనకదుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవాదుల విధుల బహిష్కరణ నేడు

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బుధవారం బహిష్కరించనున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరెడ్డి, అన్వర్‌బాషా పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, హైకోర్టు న్యాయవాది శ్రావణ్‌కుమార్‌కు సీఐడీ నోటీసులివ్వడాన్ని ఖండిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

### బ్రహ్మోత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం రేపు

నెల్లూరు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం జరపనున్నామని ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో సమావేశాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. ఆర్డీఓ మలోల అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి అధికారులు, పాలకమండలి సభ్యులు హాజరుకావాలని కోరారు.

## శిశుగృహాలో కలెక్టర్ తనిఖీలు



నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయ సమీపంలో గల శిశుగృహ, బాలసదన్‌ను కలెక్టర్ హరినారాయణన్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. శిశుగృహాలోని చిన్నారులను పరిశీలించి వారి యోగక్షేమాలను ఆరాతీశారు. వంటశాలను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అభాగ్యులైన చిన్నారులను తమ సొంత పిల్లల్లా చూడాలని కోరారు. పాలు, ఆహార పదార్థాలను సకాలంలో అందించాలని, నిర్దేశించిన షెడ్యూల్ మేరకు టీకాలను వేయించాలని ఆదేశించారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతానని చెప్పారు. ఐసీడీఎస్ పీడీ సౌజన్య, ఏసీడీపీఓ అనూరాధ, డీసీపీఓ సురేష్, బాలల సంరక్షణాధికారి సమత, మేనేజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల యాజమాన్యాలపై చర్యలకు వినతి



నెల్లూరు (టౌన్): జిల్లాలోని కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంతో పాటు నీట్, ఎంసెట్, ఐఐటీ, తదితర తరగతులను నిర్వహిస్తున్నారని, యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నరహరి కోరారు. ఈ మేరకు స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో ఆర్ఐఓ వరప్రసాద్‌రావుకు వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరారు.

## 'డీకేడబ్ల్యూ'లో యోగా దినోత్సవం



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. యోగాసనాలను హార్ట్‌ఫుల్‌నెస్, రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో చేపట్టారు. యోగా శిక్షకురాలు ప్రవీణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమణరావు, రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రి అధినేత వెంకటకృష్ణ, తెలుగు అధ్యాపకుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**సర్టిఫికెట్ల అందజేత**

నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో డయాగ్నొస్టిక్స్ టూల్స్ ఇన్ ఆక్వాకల్చర్ కోర్సుకు సంబంధించిన విద్యార్థినులకు సర్టిఫికెట్లను కేసీటీ ల్యాబ్స్ జనరల్ మేనేజర్ షోమశ్రీ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కళాశాల, కేసీటీ గ్రూప్‌లు అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. దీని ద్వారా విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు, పరిశోధనపై శిక్షణను ఇవ్వనున్నామని ప్రిన్సిపల్ గిరి తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ రమణరావు, అధ్యాపకులు ప్రసాద్, రమణి, పీఆర్వో జోజీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్నాంజనేయుడికి విశేషాభిషేకాలు

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలో కొలువైన ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో విశేషాభిషేకాలు, పూజలను మంగళవారం నిర్వహించారు. సిందూరాలంకారంలో ఆంజనేయుడు దర్శనమిచ్చారు. మామిడి ఫలాలతో సహస్రనామార్చన చేశారు. ఉభయకర్తలుగా శ్రీరామ్ సురేష్, పుష్పలత దంపతులు వ్యవహరించారు. సుమారు 700కుపైగా మామిడి పండ్లు, వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో అర్చనలు చేశారు. దేవస్థాన నిర్వాహకులు సుబ్బారావు, రామచంద్రరావు, బాలాజీ, సాయిబాబా, ఈఓ హేమచంద్రరావు, తదితరులు పర్యవేక్షించారు.

### స్టడీ మెటీరియల్ల అందజేత



నెల్లూరు (టౌన్): కొండాయపాళెం దళితవాడలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు గురుకుల, పీఆర్ విద్య ప్రవేశ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

**మహా రాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : నెల్లూరు**

IP.No.45 of 2022

బెల్లంకొండ రాణి - పిటీషనర్

V/s

1.గుంజి మనోహర్ & another - రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

పై తెలిపిన పిటీషనర్ అయిన బెల్లంకొండ రాణి గారు గుంజి మనోహర్ మరియు గుంజి మురళికృష్ణ అను వారల మీద క్రెడిటర్స్ ఐ.పి. దాఖలు చేసి సదరు గుంజి మనోహర్ ను ఇన్‌సాల్వెంట్‌గా నిర్ధారించి, సదరు మనోహర్ సదరు గుంజి మురళీకృష్ణ గారి పేరట వ్రాయించి యిచ్చిన విక్రయ పత్రములు Document Nos. 11148/2022 and 11151/2022 రద్దుపరచమని కోరుతూ పై తెలిపిన పిటిషన్ దాఖలు చేసినారు. సదరు I.P.No: 45/2022 అను కేసు తే: 20-04-2023 దికీ వాయిదా కలిగి ఉన్నది. కావున ఎవరికైనా నను ఎటువంటి అక్షేపణలు ఉన్న యెడల తే.20-04-2023 దిన ఉ॥ 10.30 ని॥లకు పై కోర్టులో హాజరై తమ అక్షేపణలు తెలుపుకొనవలసినది.

యస్.శ్రీనివాసమూర్తి B.A., B.L.
పిటీషనర్ తరఫు అడ్వకేట్
నెల్లూరు




